**మూడంతస్తుల మేడమెట్లు మెల్లిగా ఎక్కి, ఆఫీసు తలుపుకి లోపల గేడపెట్టి కోటు కొక్కానికి తగిలించి, కుర్చీలో కూలబడి కాళ్ళు రెండూ బల్ల మీదకి బారజాపి బరువుగా నిట్టూర్చేరు మిడతంభొట్లు మేష్టారు.**

అక్కడక్కడ అపురూపంగా వున్న అరడజను వెంట్రుకలని మునివేళ్ళతో దువ్వుకుంటూ ఎదురుగా వున్న గాజద్దాల కిటికీలోంచి శూన్యంలోకి కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్నాడాయన. ఏయిర్ కండిషనర్ సన్నటి బుసతో చల్లటి గాలిని గదిలోకి పంపుతున్నప్పటికీ, ఎప్పుడూ నిర్మలంగా వుండే మాష్టారి విశాలమయిన నుదురు చిరుచెమటలతో చెమ్మగిల్లింది.

లంచి సమయానికని తెచ్చుకున్న ఫ్లాస్కులోని కాఫీ కప్పునిండా పోసికొని తాగేసేరు. కుర్చీలోంచి లేచి ఆఫీసు గదిలోనే బోనులోని పులిలా కొంతసేపు తిరిగారు. తక్షణ కర్తవ్యం తేల్చుకోలేక మళ్ళా కుర్చీలో కూలబడ్డారు.

చేసే చిన్న చిన్న సంఘటనలలో అసామాన్యత కనిపిస్తుంది మిడతంభొట్లు మేష్టారి మనో నేత్రానికి. ఈ సమర్థతని దొరతనం వారు వాడుకో దలచేరు.

ఈ విశ్వానికి అయిదవ కొలత వున్న

# బ్రహ్మాండం బద్దలయింది!

## — వే. వేమూరి.



ఆ రోజు ఉదయం సంగతి! తూరుపు తెల్లవారుతోంది. ప్రత్యూషపు లేత కిరణాల వెచ్చదనంతో జీవకోటిలో చైతన్యం పెరగడం మొదలయింది. పెరట్లో తులసికోట దగ్గర మామ్మ.

మన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వ
దేవతాం
యదగ్రే సర్వవేదాశ్చ తులసీం త్వాం
నమామ్యహః

అంటూ పొద్దుటపూజపూర్తి చేస్తున్నది. అప్పుడే వ్యాయామ స్నాన సంధ్యాదులు పూర్తి చేసుకొని మిడతంభొట్లు మేష్టారు గృహిణితో కబుర్లు చెబుతూ కాఫీ సేవిస్తున్నారు. వీధి వరండాలో వున్న బల్ల వుయ్యాలలో కూర్చొని. నాన్నగారు ఎవరి జాతకాన్నో మరమ్మత్తు చేస్తున్నారు. సలక్షణంగా యిలా సాగిపోతూన్న కార్యక్రమం కాస్తా కాఫీ కప్పు వేపు చూస్తూ, చిరంజీవి కేజువల్‌గా చేసిన కామెంటుతో కుంటుపడింది. గుంట వెధవ! ఇలాగ, అలాగ కాదు! ఏటం బాంబులా వదిలేడు! భారత యుద్ధంలో అశ్వత్థామ వదిలిన బ్రహ్మాస్త్రంలా. చిరంజీవి మాటలు మిడతంభొట్లు మేష్టారిని ఎక్కడికి వెళ్ళినా వెంటాడుతున్నాయి.

మరొకడు, మరొహడూ అయితే, యీ రోజుల్లో మన కుర్రకారు కూసే అర్థంలేని ఊతపదాల్లో ఇదొహటను కునేవారు. కాని మిడతంభొట్లు మేష్టారు ఏదో సామాన్యమయిన ఉల్లాగాడయితే ప్రభుత్వంవారు ప్రత్యేకంగా ఆహ్వానించి రక్షణ శాఖలోని శాస్త్రవేత్తలసిబ్బందికి నాయకుడిగా నియమించి వుండేవారుకాదు; ఏ ఆంధ్రయూనివర్శిటీ కేంపస్‌లోనో అలా రాటవుతూ వుండేవారు. దైనందిన జీవితంలో ఏదో సామాన్యమయినదని అందరూ నిర్లక్ష్యం చేసే చిన్న చిన్న సంఘటనలలో

దని ప్రతిపాదించి, దానిని సమర్థిస్తూ, ఆ మధ్య ఆంధ్రాయూనివర్శిటీలో వున్న రోజులలో, ఆయన కొన్ని వ్యాసాలు ప్రచురించేరు. ఈ ప్రపంచం త్రిమాత్రకం అని మనందరికీ తెలిసిన విషయమే. పొడుగు, వెడల్పు, ఎత్తులతోబాటు కాలం కూడ ఒక ప్రాథమిక మయిన కొలతేనని ప్రతిపాదించి, అయిన్‌స్టయిన్ ప్రపంచాన్ని ఒక వూపు వూపేసేరు. ఈ సిద్ధాంతానికో కొత్త మెలిక పెట్టేరు మిడతంభొట్లుగారు. నిజానికి, యీ విశ్వానికి అయిదో కొలత వుందన్న సిద్ధాటనే యీ మెలికకు మూలం! యూనివర్శిటీ క్లబ్బులో బ్రిడ్జి ఆడకుండా, తన మానాన్న తను చేసుకు పోతూన్న రిసెర్చి ఫలితాలు పదిమంది కళ్ళబడ్డాయి. సమర్థులు, శ్వేత వర్ణులు అయిన శాస్త్రవేత్తలు కొందరు "ఔరా!" అన్నారట. అని ఊహుకున్నారా!



"మిడతంభొట్లుగారి సిద్ధాంతాలు చదివి అర్థం చేసికోడానికి పంచేంద్రియాలు చాలవు. దివ్యదృష్టి వుండాలి" అని వ్యాఖ్య వ్రాశారుట ఒక దొర. వ్రాసి వూరుకున్నాడా? "A Sixth Sense is Required to Appreciate the Fifth Dimension" అని ఇంగ్లీషులో చమత్కరించేడుట. "మీ తెలుగు ఇటాలియన్‌లా వుందిస్మీ" అని ఒక దొరగారు అబ్బుర పడేసరికి, ఇది నిజంగా పొగడ్తేనా లేక మనని కాని వెటకారం చేస్తున్నారా అని ఆలోచించకుండా, తృప్తిపడి ఆనందించిన ఆంధ్రుడిలా అదిరి పడింది నయాదిల్లీ!- మిడతంభొట్లు గారి మీద దొరగారు వ్రాసిన వ్యాఖ్య చూసి అదిరిపడి ఢిల్లీ పిలిపించింది. పిలిపించి పదవి నొకదానిని ఇచ్చి గౌరవించింది. టూకీగా ఇదీమన కథానాయకుడి పూర్వ గాథ.

పులి కడుపున పిల్లి పుడుతుందా? మిడతంభొట్లు గారి వంశోద్ధారకుడు పసితనంలోనే పరిమళించ సాగేడు "ఏమండీ! దివ్యదృష్టిగారూ!" అని తనను ఎవరయినా ఎగతాళి చేస్తూ సంబోధిస్తే, తేలికగా నవ్వి పారేసే మనిషి, తన కుమార రత్నానికి అదే శక్తి వుండేదేమోనని అప్పుడప్పుడు అనుమానించక పోలేదు. ప్రతి తండ్రీ తన పిల్లలకి నోబెల్ బహుమానం రావాలని కోరుకొనడంలో తప్పేమీ లేదు. తను సాధించలేని ఆశయాలని తన సంతానం అయినా సాధించాలని ఆశించడంలో అబ్బురం అంత కంటె లేదు. మిడతంభొట్లు ఇటువంటి మానవ దౌర్బల్యాలకి అతీతుడు కాదు. కాని చిరంజీవికి దివ్యదృష్టి వుండేమోనని అనుమాన పడడానికి పుత్ర వాత్సల్యం కంటె అతీతమయినవి, బలమయినవి అయిన ఆధారాలెన్నో వున్నాయి. మచ్చుకి ఏడాది క్రితం సంగతి, ప్రభుత్వపు పని మీద పై వూరు వెళుతూ వుంటే "వర్షం పడేట్టు వుంది.

# సుభాషితాలు

జీవితం అనే మాల ఎప్పుడయినా వాడి పోవచ్చు కనుక సాధ్యమైనంతవరకు మంచి పుష్పాలనే ఎన్నుకొని మాల కట్టుకో.

—పండిట్ నెహ్రూ

* * *

తత్వవేత్తలు పాలకులైతే తప్ప మానవ జాతికి సుఖం లేదు. —ప్లేటో

* * *

పలుకుబడి అద్దం లాంటిది. ఒకసారి పగిలితే అది ఉపయోగించదు.

* * *

దేని స్థానంలో అది ఉంటేనే ఉపయోగం. ఉద్యానవనంలో ఆవు ఉండడం ఏం లాభం?

* * *

తక్కువవాడే మోసగిస్తే అది దారుణమైన నేరం. ప్రభుత్వాలు, ప్రముఖులు చేస్తే అది రాజకీయ తంత్రం, మంత్రాంగం.

—దేవులపల్లి క్రిష్ణశాస్త్రి

* * *

హక్కులనేవి వాటిని కాపాడుకోగలిగే శక్తి వున్న వారికే వుంటాయి —

* * *


ఈ తరం పోతుంది- మరో తరం వస్తుంది. పృధ్వి మాత్రం స్థిరంగా నిలచి వుంటుంది. —ఓల్డ్ టెస్టమెంట్

* * *

జీవితానికి ఒకే గమ్యం మరణం.

—సిగ్మండ్ ఫ్రాయిడ్

సేకరణ: పి. రామసీత



రెయిన్ కోటు. గొడుగు పట్టుకెళ్ళండి నాన్నా!" అన్నాడు. వెళ్ళేది ఎడారిలోకి. అక్కడ దశాబ్దికో జల్లు పడితే అది పత్రికంలో పతాకశీర్షిక నధిష్టించే వార్త. అటువంటి ఎడారిలో కుండపోతగా వర్షం కురిసిందా నాడు. ఇటువంటి చిల్లరమల్లర సంఘటనలు ఇంకా ఎన్నో జరిగాయి. మిడతంభొట్లు గారి తార్కికమయిన బుద్ధికి ఇలా చెదురు మదురుగా జరిగిన సంఘటనలలో కొట్టొచ్చినట్లు ఒక బాణీ కనిపించసాగింది. నెమ్మదిగా ఒక అనుమానం పుట్టింది. పుట్ట, పురుగులా గొలకడం మొదలు పెట్టింది.

చంద్రుడు గుడి కట్టినా, కీచురాయి కూతకూసినా, సముద్రం హోరు పెట్టినా వర్షం పడుతుందని మామ్మ జోస్యం చెప్పేది. ఆకాశవాణి వారు చెప్పినప్పుడల్లా వర్షం పడుతుందని భరోసా ఏమీ లేదు కాని మామ్మ చెబితే వరుణ దేవుడు చెంకలు కొట్టుకుంటూ వచ్చేవాడు. అంత మాత్రం చేత మామ్మకి దివ్యదృష్టి వుందని తను ఎప్పుడూ అనలేదే! చిరంజీవి పద్ధతికి, మామ్మ పద్ధతికి హస్తిమశకాంతరం తేడా వుంది. అడిగిన వాళ్ళందరికీ, అడగక పోయిన కొందరికీ, కుల మత భేదాలు చూపకుండా. మామ్మ తన జోస్యాన్ని ఉచితంగా పంచి పెట్టేది. ఉత్తుత్త జోస్యం చాలామంది చెబుతారు. భవిష్యత్తుని తెలిసికొన్న తర్వాత, ఆ భవిష్యత్తు తన కళ్ళ ముందు వెడుతూ వుంటే, నాటకాన్ని చూసే ప్రేక్షకుల్లా, స్తబ్దుగా కూర్చోవడం ఆవిడకి ఇష్టంలేదు. వర్షం పడే సూచనలు బొత్తిగా శూన్యం అయితే, వెంటనే అవధాని గారికి కబురంపి, ఈశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం చేయించేది. వేసవికాలంలో చెట్లన్నీ కదలకుండా సిపాయిల్లా నిలబడి వుంటే, గుమాయింపు తగ్గడానికని. "దూ గాలీ! దుప్పన్నగాడే. పాటి మీద గాలీ, ప్రాగాలీ!" అని బుజ్జగించేది. టూకీగా చెప్పాలంటే. భవిష్యత్తుని లోక కళ్యాణార్థం మరమ్మత్తు చెయ్యడానికి వెనక తీసేది కాదు ఆమె. ఈ అంశే నాన్న గారిలోనూ వుంది. ఆయన జాతకాలు మరమ్మత్తు చెయ్యగలరు, లేకపోతే ఏమిటి చెప్పండి? గ్రహమాలికా యోగం చుక్కలో తప్పిపోయి, బంగారం ముట్టుకుంటే మట్టి అవుతూ వున్న ఒక దైవోపహతుడి జాతకంలో, గ్రహ స్థానాలు కొన్ని మరమ్మత్తు చేసి, ఆ జాతకుడిని అమెరికా ఎలా పంప గలిగేరు ఆయన? చాల మంది దీనిని 'ఆటోసజషన్' అని రాజీ పడ్డారు. ఏది ఏమయినా ఇదేదో వంశపారంపర్యంగా వస్తూ వున్న అంశంలాగుంది కానీ.........

'పోలికలు ఎక్కడికి పోతాయి!' అని మిడతంభొట్లు సమర్థించుకొని చాలరోజులు ఊరుకొన్నాడు. కాని కుర్రాడి బాణీ కొట్టొచ్చినటు కనిపిస్తూ వుంటే! "ఒరే! నాన్నా!! నైన్ డవున్ ఎంత లేటవుతుందిరా?" అని మీరు ఎంత బుజ్జగించి అడగండి. రయిల్వే వారికెంత తెలుసో, వీడికీ అంతే తెలిసేది. బిక్కమొహం మాత్రం జవాబుగా మిగిలేది. లేకపోతే ఏ గిండీలోనో గుర్రాల మీద కాసేసి, ఈపాటికి మేలిమి బంగారపు టికీకలతో మేడ కట్టక వుండే వాడా తను! ఎప్పుడో ముక్తసరిగా మూడు ముక్కలు చెబుతాడు. అది భవిష్యత్ పురాణమో, బుకాయింపో మిడతంభొట్లు గారికి తెలిసి పోయేది.

ఇంతకీ చిరంజీవి ఏమన్నాడంటే, "బ్రహ్మాండం బద్దలవుతూంది నాన్నా!" అన్నాడు. ఇదేదో కొంపలంటుకు పోయే విషయం కాదు కదా అని, తను వెంటనే పెద్దగా పట్టించుకోలేదు. కాని రానురాను ఆ మాటలు తనని వెన్నాడుతూ వస్తూన్నట్లనిపించింది. ఆ మాటల్లో ఏదో అంతరార్థం వుందని తన అంతర్వాణి ఘోషిస్తోంది. డ్రైవరు కారు తోలుతూ వుంటే వెనక సీట్లో కూర్చున్న మిడతంభొట్లు మేష్టారి మనోసాగరంలో, ఉత్తుంగ తరంగాలు పడి లేస్తున్నాయి. మనస్సలా మధన పడ్డప్పుడల్లా, ఓంకార శబ్దం మీద దృష్టిని కేంద్రీకరించి, శూన్యంలోకి చూడటం ఆయనకిఅలవాటు. ఈరోజూ అదే చేశారు ఆయన. ముందస్తుగా, కంటి ముందు ఏదో నలక లాంటిది వెలుగు కనిపించింది. ఆయన కళ్ళు నులుముకున్నారు. ఆ నలక అక్కడే వుంది. మధ్య వేలిని కంటిరెప్ప మీద వుంచి నెమ్మదిగా ఇటూ, అటూ గుద్దుని నొక్కారు. ఆశ్చర్యం! ఆ నలక స్థాన భ్రంశం చెందలేదు. అక్కడే వుంది.

కార్టూన్ కథ

# అంచనా

"రేపు నా పెళ్ళి చూపులు. నువ్వు తప్పక రావాలి" అన్నాడు ప్రసాద్.

"అలాగే లేరా" హామీ ఇచ్చాడు ప్రాణ స్నేహితుడు సుందరమూర్తి.

కనిపించిన ప్రతి మగవాడి అందాన్ని బట్టి అతని చెల్లెలి అందాన్ని ఊహించి చెప్పేవాడు ప్రసాద్.

ఈ విషయంలో మూర్తి ఎప్పుడూ ఓడి పోతుంటాడు. "నేను ఓడిపోతే వెయ్యి రూపాయలిస్తా" అంటుండేవాడు ప్రసాద్.

మరుసటి రోజు అంతా పెళ్ళి చూపులకు వెళ్ళారు.


అమ్మాయిని నెమ్మదిగా తీసికొచ్చి కూర్చోపెట్టారు.

నెమ్మదిగా తలెత్తి చూశాడు ప్రసాద్.

అక్కడ కూర్చొన్నది అమ్మాయి కాదు. అబ్బాయి.

కొంచెం నల్లగావున్నా అందవిహీనంగా మాత్రం లేడు

"ఏరా అలా అయిపోయావ్. అతను అమ్మాయి అన్న. ఆమె అందాన్ని ఊహించుకొని నచ్చిందోలేదో చెప్పు." అన్నాడు మూర్తి



శిలాప్రతిమలా కూర్చుండి పోయాడు ప్రసాద్. అప్పుడే తీసుకొచ్చిన అమ్మాయిని చూసి కనురెప్ప వేయడం మరచి పోయాడు.

అమ్మాయి బాగుండదని ఊహించుకొన్న ప్రసాద్ ఓడిపోయాడు.

"ఏరా వెయ్యిరూపాయిలిస్తావా" చెవిలో గొణిగాడు మూర్తి ఎలాగైతేనేం గెలిచాననుకుంటూ.

"పదివేలు యిస్తాను" అంటూ నాలిక కరుచుకొన్నాడు ప్రసాద్.

[మూర్తి ఎలాగైనా పందెంలో గెలవాలన్న ఉద్దేశ్యంతో ప్రసాద్‌కు కాబోయే మామగారితో కలసి నాటక మాడిన సంగతి ప్రసాద్‌కు తెలియదు పాపం]

—గుంపర్తి శ్రీనివాసమూర్తి

అంతే కాదు. కొద్ది కాలంలో 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు ఆ వెలుగు శంఖాకారంలో అలా.... అలా.... సాగుతూ అనంతంలోకి కలసి పోయింది. శూన్యమనే నల్లటి కొండలో, వెలుగుతో దొలచిన గుహలాగుంది ఆ ఆకారం ఇప్పుడు! తను మాత్రం ఆ సొరంగపుటవలి దరిని వున్నాడు. నూతిలో నుండి వచ్చినట్లు, ఆ సొరంగపుటద్దరి నుండి, అవ్యక్తమయిన ఓంకార శబ్దం లాంటి శబ్దం ఒకటి వినిపించ సాగింది. ఒక్కసారిగా తలలో పోటు వచ్చినట్లయింది. శరీరంలోని శక్తినంతటినీ కూడ గట్టుకొని, మనస్సుని ఆ శబ్దం వైపే కేంద్రీకరించారు మిడతంభొట్లు మేష్టారు. ఓంకారంతో మొదలయిన శబ్దం నెమ్మదిగా విశదం కావచ్చింది. "మీ భవిష్యత్తు, మీ లోకం, మీసూర్య.... నవ నోవ...." మాటలు వినబడుతున్నాయి కాని, కారు హారన్లు, రోడ్డులోని రొద, వీటిలో ఆమాటల భావం ప్రస్ఫుటమవలేదు. తమాషా ఏమిటంటే ఏదో ఆకాశంలో చూస్తూ వున్న సొరంగం నుండి వస్తూవున్న శబ్దంలా లేదని, తన అంతర్వాణి, తనని దేని గురించో హెచ్చరిస్తున్నట్లనిపించింది.

"బాబుగారూ! ఆఫీసుకి వచ్చేశాం" అన్న డ్రైవరు మాటలు మిడతంభొట్లు గారి ఆలోచనలకి అంతరాయం కలిగించి, అనంతపుటవధులనుండి ఈ లోకానికి తీసుకొని వచ్చేయి.

కారు దిగి, మేడమెట్లు ఎక్కి, ఆఫీసులో అడుగు పెట్టేరన్న మాటేగాని, మిడతంభొట్లుగారి మనస్సు మాత్రం మన లోకంలోకి రాలేదు. కళ్ళెం లేనిగుర్రంలా పరిపరి దిశలలో పరుగులు తీస్తోంది. ఏదో కుర్రవాడి కొంటె కూతలనే పునాదుల మీద తను నిర్మించిన ఊహాసౌధాలని తలుచుకొని తనలో తానే ఒకసారి నవ్వుకుని, ఈ లోకంలో పడ్డారు మిడతంభొట్లు, కాని నుదుటిమీద చిరు చెమట? కాళ్ళలో నీరసం? రెండోకప్పు కాఫీ కూడ ఏమీ పని చేసినట్టు లేదు. హృద్రోగం కాని రాలేదుకదా? ఎందుకయినా మంచిదని వైద్యుడికి ఫోను చేసి, అనుమానాన్ని వెల్లడి చేశారు.


"హార్టు ఎటాక్ ఎవరెవరికి ఏయే సమయాల్లో వస్తుందో నేను చెప్పలేకపోవచ్చుగాని, మీకు మాత్రం రాదని హామీ ఇవ్వగలను" బిగ్గరగా నవ్వుతూ అన్నారు డాక్టర్ శర్మ "బక్క పలచని శరీరం ధూమపానం చెయ్యరు, విస్కీ వగయిరాలు సేవించరు. మీకు హార్టు ఎటాక్ ఏమిటండి? ఎందుకయినా మంచిది. ఒకసారి ఫిజికల్ చేస్తే సరిపోతుంది. సాయంకాలం ఆఫీసుకి రండి."

డాక్టరుగారు చెప్పిన ధైర్యపు మాటలకి గుండె ధైర్యం చేసికొని ఆఫీసులో పనికిఉపక్రమించేరు మిడతంభొట్లు. కాని పనిమీదకి మనస్సు పోవడంలేదు. కాళ్ళు రెండూబల్లమీదకి వేసి, పి వెల్ ఛెయిర్ లో వెనకకి జారబడి, కళ్ళు మూసుకొని కూర్చున్నారు. అలా ఎంత సేపు కూర్చున్నారో ఆయనకే తెలియదు. ఇంతలో, కంటికెదురుగా వున్న దృక్ క్షేత్రంలో ఏవేవో వింత వింత కాంతులు కనిపించ సాగాయి. ఆ కాంతులలో నేతి దీపం అంతటి వెలుగు కనిపించింది. మళ్ళా అదే శంఖాకారం.... సొరంగం.... అనంతం! ఆ అనంతపుటావలి అంచు నుండి, మళ్ళీ అదే శబ్దం. పోతే, ప్రశాంతంగా వున్న యీ వాతావరణంలో ఆ శబ్దం స్పష్టంగా వినిపిస్తోందిప్పుడు.

"మీ ప్రపంచం బ్రహ్మాండమయిన ప్రమాదానికి లోనవుతోంది. మీ చాకచక్యం, మీ దూరదృష్టి, మీ తెలివి తేటల మీదే మీ మనుగడ ఆధారపడివుంది." అన్న మాటలు మిడతంభొట్లు గారిని ఆశ్చర్య చకితుణ్ణి చేశాయి. తనెవరితో మాట్లాడుతూనట్లు? అయినా యిప్పుడు ఈ ప్రపంచానికి వచ్చిన ఆపదఏమిటి? నిలకడలేని మనస్సు తనతో చెలగాటాలు ఆడుతున్నదా? పొరపాటున తను కానీ ఎల్. ఎస్. డి. వంటి రసాయనిక పదార్థాలేవీ తిన లేదుకదా! తను నిజంగా ఎవరితో నయినా మాట్లాడుతున్నాడా? లేక తనలో తనే మాట్లాడుకుంటున్నాడా? ఈ ప్రశ్నలకి సమాధానాలు కావాలి?

"ఎవరు మీరు? ఎక్కడినుండిమాట్లాడుతున్నారు? నాతో ఎలా మాట్లాడు గలుగుతున్నారు?" అని ఆతృతగా అడిగారు. అహఁ హఁ, అడగలేదు. అడుగుదామని అనుకుంటున్నారు. ఇంతలోనే....

"మేము మీ లోకంవాళ్ళం కానేకాము. మీసూర్యమండలానికి దరిదాపు పదకొండు




కాంతి సంవత్సరాల దూరంలో వున్నాము మేము. మా ఆకాశంలో వున్న సూర్యుడు కంటే మీసూర్యుడు త్రైవారంలోను, కాంతిలోను చాల చిన్న. అతి కొద్దికాలంలో మీ సూర్యుడి కాంతి నూరింతలు పెరిగిపోతుంది. ఆ సందర్భంలో మీ సూర్యుడు పేలిపోయి పటా పంచాలయి పోయే అవకాశాలు లేకపోలేదు. అప్పుడు, ఆ సూర్యుడితోపాటు, మీ గ్రహమండలాలన్ని అదృశ్యమయి పోతాయి. మీ సంస్కృతిని రక్షించు కోవాలంటే మీరు శీఘ్రంగా మరొక చోటకి వలస పోవాలి."

టెలిఫోనులోని మాటల్లా స్పష్టంగా వినిపిస్తూ వున్న శబ్దం మిడతంభొట్లుగారి మేధకి అగ్నిపరీక్ష అయి కూర్చుంది. విపృత్తి కానిఅనుమాన తరంగాలు ఆయన మనోసాగరంలో ఉవ్వెత్తున లేస్తున్నాయి. భూలోకం అంతా భస్మం అయిపోతుందా? యుగాంతం సమీపించిందా? ఈ విషయం ప్రభుత్వాధికారులతో ప్రయివేటుగా సంప్రదించాలా? ప్రజలందరికీ పత్రికల ద్వారా తెలియజెయ్యాలా? ప్రజలంతా గాభరాపడి దొమ్మీ చేస్తారేమో? లేక సజావుగా ఆలోచించి, ఆసన్నమవుతూ వున్న బృహత్ ప్రమాదాన్ని ఎదుర్కోడానికి, ప్రపంచంలోని ప్రజలంతా కక్షలూ, కావేశాలూ కప్పెట్టుకొని సోదరభావం చూపుతారేమో! ఈ సందర్భంలో నయినా ఈ ప్రపంచానికి 'శాంతి' లభిస్తే! కాని ఇటువంటి విషయం నలుగురి చెవినా పడితే మరో చిక్కు వుంది. పత్రికల వారినుండి తుంటరి వెధవలవరకూ, ప్రతివాడు సవాలక్ష ప్రశ్నలు వేస్తాడు. వీటన్నిటికి కాకపోయినా, కనీసం కొన్నిటికయినా సమాధానాలు తనుతయారుగా వుంచుకోవాలి. లేకపోతే, తన పరువు ప్రతిష్టలు పూర్తిగా గంగపాలయి పోతాయి. ఇలాంటి తర్జన భర్జనలతో మిడతంభొట్లుగారి మస్తిష్కం మిషనులా పనిచెయ్యడం మొదలుపెట్టింది. ఆగంతకమయిన శబ్దాన్నుద్దేశించి ప్రశ్నల వర్షం కురిపించేరు.

"మీరు మాకు పదకొండు కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నట్లయితే నేను మీతో టెలిఫోనులో మాట్లాడినట్లు మాట్లాడగలగడం అసంభవం! మీవార్త మా చేరడానికి పదకొండు సంవత్సరాలు, నా సమాధానం మీకు చేరేసరికి పదకొండు సంవత్సరాలు. ఈ లెక్కని సంభాషణ కుదరదు. అంతేకాదు. ఇరవై రెండు సంవత్సరాల క్రిందటి మా సూర్యుడి పరిస్థితిని గమనించి, ఇక కొద్ది కాలంలో జరగబోయే విషయాన్ని...."

"రాతి యుగం! రాతి యుగం!! మా పూర్వీకులు కూడా ఇటువంటికుతర్కంతో కొన్ని శతాబ్దాలు కొట్టుకున్నారు. మా వాళ్ళు కాంతి వేగంతో సమమయిన వేగంతో వాకేశాలు పంపడం అసాధ్యం అన్నారు. ఈ విశాల విశ్వంలో ఉన్న కోట్ల కొద్ది ప్రపంచాలు, ఒకరి సంపర్కమింకొకరికి లేకుండా, మహాసముద్రంలోని ద్వీపాలలా, ఒంటి పిల్లి రాకాసులలా వుండ వలసిందేనన్నారు. అంతర్ ప్రపంచ సంభాషణలు అసంభవం అన్నారు. 'కాంతివేగం' అనే అవధి చే నిర్మింపబడ్డ ఖైదులో బందీల మన్నారు. ఇలా కొన్ని శతాబ్దాలు గడిచేయి. వాకేశాల వేగం కాంతివేగంతో సమానం కాకపోయినా కాంతివేగాన్ని మించిన వేగంతో వాకేశాలు పంపగలమా అన్న ఆలోచన వచ్చేసరికి చాలకాలం పట్టింది."

"మీరనేది వార్తా ప్రసారం కాంతి వేగాన్నధిగమించి చెయ్యడం సుసాధ్యమే నంటారు? కాంతి వేగంతో సమానం కాకుండా వున్నంతసేపూ చిక్కేదీ లేదంటారు? అంతేనా?" ఈ ప్రశ్న అడుగుతూ వున్నప్పుడు టెక్సాస్ యూనివర్సిటీలో వున్న ప్రొఫెసర్ సుదర్శన్ గారి 'టేకయాను' సిద్ధాంతం మిడతంభొట్లు గారి బుర్రలో మెదిలింది.

"అవును!" ఆకాశవాణి పలికింది. "ఈ మహావిశ్వంలో అవధిలేని వేగంతో ప్రయాణం చేసేది ఏది? భౌతిక శాస్త్రవేత్తగా కాకుండా. సామాన్యుడిగా ఆలోచించి చూడండి!"

"మనస్సు!" అప్రయత్నంగా అన్నారు మిడతంభొట్లు. అలా అంటూ వున్నప్పుడు మహాభారతంలో యక్ష ప్రశ్నలకు సమాధానం చెబుతూ వున్న యుధిష్టిరుడులా వున్నారాయన. ఏదో జ్ఞానోదయం అయినట్లయింది. భౌతిక శక్తులకు సాధ్యమనిపించే క్రియలెన్నో మనోశక్తితో సాధించ వచ్చునని వశిష్టాది మహామునులు నిరూపించేరే! అంటే, సనాతనులు చెప్పేవన్నీ వుత్త పుక్కిటి పురాణాలు కావేమో! అంతర్గతంగా వున్న ఈ మనో శక్తిని కూడ గట్టి, కేవలం ఇచ్ఛామాత్రకంగా మనశరీరంలో ఉత్పరివర్తనాలు కల్పించ వచ్చునని ఈ మధ్య అధునాతనులు కూడ వాదిస్తున్నారు. ఇవన్నీ పటిష్టం లేని సిద్ధాంతాలయితే, ఈ మనో శక్తికి సంబంధించిన 'టెలీపతీ' 'డివినేషన్' వంటి విషయాలమీద రష్యన్ శాస్త్రిజ్ఞులు విరివిగాపరిశోధనలు ఎందుకు చేస్తారు? ఇలా మిడతంభొట్లుగారి మనస్సు పరివరి విధాల పరుగెడుతున్నది. అంతేకాని ఒక్క మాటయినా పైకి అనలేదు.

"అవును! మనోశక్తికి మించిన శక్తి మరొకటి లేదు. ఈ శక్తిని ఉపయోగించి వ్యాధి గ్రస్తులకి స్వస్థత చేకూర్చవచ్చు. వాకేశాలని ప్రసారం చెయ్యవచ్చు. భవిష్యత్కాలంలోకి చూడవచ్చు. అన్నిటి

కంటే ముఖ్యవిషయం ఈ శక్తులో వార్తలని ప్రసారం చేసినప్పుడు, భాషతో ప్రమేయంలేదు. నిజానికి మీభాష ఏమిటో కూడ మాకు తెలీదు. తెలియవలసిన అవసరం కూడ లేదు. మేము ప్రసారం చెయ్యదలుచుకున్న వార్త మీద మా సర్వేంద్రియాల శక్తులనీ కేంద్రీకరిస్తాం. అప్పుడు, మా 'ఎంటెనా'లద్వారా ఆ వార్తని ప్రసారం చేస్తాం."

"మీ సంకేతాలు గమ్యస్థానం చేరిన తర్వాత వాటిని 'డీకోడు' చేసి అర్ధం చేసికొనడం ఎలా?"

"ఇది చాలా మంచి ప్రశ్న. ఈ విషయంపై ఇంకా పరిశోధనలు చేస్తున్నాం. ప్రస్తుతం మా మనోశక్తిలో సగం వార్తని ప్రసారం చెయ్యడానికి, రెండవ సగం వార్తని డీకోడు చెయ్యడానికి, తిరిగి మీరిచ్చే సమాధానం రాబట్టడానికి వాడుతున్నాం. ఉదాహరణకి ప్రస్తుతం మా శక్తి మీ మస్తిష్కం మీద కేంద్రీకరించబడివుంది. ఈ సందర్భంలో, మా ఆలోచనలు మా మెదడులో ఎటువంటి విద్యుత్-రసాయనిక క్రియలని ప్రేరేపిస్తున్నాయో, వాటికి సారూప్యమయిన విద్యుత్-రసాయనిక క్రియలు మీ మెదడులోని చక్షుశ్రవణ కేంద్రాలలో చెల రేగుతున్నాయి. మేము రేడియో కేంద్రం వార్తలని ప్రసారం చేసిన రీతిలో 'బ్రాడ్‌కాస్టు' చేస్తున్నాం కనుక, ఎవరి మెదడు మా 'ఫ్రీక్వెన్సీ'కి 'ట్యూన్' అయి వుంటుందో, వారికే మా వార్త చేరుతుంది. చేరినా, అందరికీ సంకేతంలోని విశేషమేమిటో అర్థం కాదు. సంకేతాన్ని డీకోడు చేసి వార్తని పైకిలాగే శక్తి ఏకాగ్రత ఎక్కువగా వున్నవారికే వుంటుంది. వారికే మా మనస్సులోని భావం వ్యక్తమవుతుంది. ఇటువంటి శక్తులలో ఏది లోపించినా మా ప్రేరణ, అర్ధ రహితంగా వుంటుంది. ఉండదమే కాదు, కొందరు రోగ గ్రస్తులవలె కొన్ని బాహ్యలక్షణాలు ప్రదర్శించడం కూడ కద్దు. మాశక్తి తగ్గిపోతు.... మీ ఏకాగ్రత్తలో మీ...."

విశ్వాంతరాళం నుండి వచ్చిన శబ్దం కర్పూరం విందుకున్న హారతిలా హరించి పోయింది.

మిడతంభొట్లు మేష్టారు క్షణంపాటు నిశ్చేష్టులయి నిశ్శబ్దంగా కూర్చున్నారు.

దివినుండి భువికి వచ్చిన వార్త యొక్క సారాంశం ఆయన శరీరంలోని కణసారంలోకి నెమ్మదిగా ఇంకుతోంది.

పుట్టపర్తి సాయిబాబా గారి శక్తి ఎటువంటిదో ఇప్పుడు మేష్టారుగారికి కొద్ది కొద్దిగా అర్థం అవుతున్నది. ఇటువంటి పద్ధతి ఏదో ఒకటి లేకుండా, సాయిబాబా గారు ఇంగ్లీషువాడికి ఇంగ్లీషులోను, తెలుగువాడికి తెలుగులోను, అరవ సోదరుడికి తమిళంలోను సమాధానం ఎలా చెప్పగలిగేరు? ఆయనని సంబోధించి ప్రశ్న అడకకుండానే, రాబోయే ప్రశ్నకి ఆయన ఒకసారి సమాధానం చెప్పేరుట! తపోశక్తి అంటే ఇదే కాబోలు. తపోశక్తి శరీరంలో ఉత్పరివర్తనాలు కలిగించి వుండకపోతే, కాయినలుపుగా వుండే ముమ్మిడివరం బాలయోగి పదహారోపన్నె బంగారపు ఛాయలోకి ఎలా వచ్చాడు? పాశ్చాత్యులు, కాజ్, ఎఫెక్ట్, అంటూ మనని తప్పుదారి తొక్కించారా! మన మహర్షులు మనం అనుకుంటున్నంతగా, ఉత్తుంతలు కాదేమో!

వింత పాతబడ సాగింది మెల్లిగా. మేష్టారు తనకి తెలిసిన శాస్త్రాన్ని ఒక సారి సింహావలోకనం చేసి చూసుకొన్నారు. ప్రొఫెసర్ చంద్రశేఖర్ సిద్ధాంతం ప్రకారం మన సూర్యుడి మనుగడకి ఎక్కడా ధోకా లేదు. చంద్రశేఖర్ సిద్ధాంతంలో ఎక్కడయినా లోపం వుందా? అబ్బే! ఏభయి ఏళ్ళగా చలామణీ అవుతున్న సిద్ధాంతానికి నోబెల్ బహుమానం కూడ లభించింది. కాని, న్యూటన్ సిద్ధాంతానికి రెండు శతాబ్దాలు చలామణీ అయిన తర్వాత అయిన్‌స్టయిన్ చేత సవరించబడింది. అలా అయి వుండవచ్చు కదా ఇప్పుడు కూడ!

మన సూర్యుడు చంద్రశేఖర్ సిద్ధాంతానికి విబద్ధుడు కాకుండ ప్రవర్తిస్తే సౌరకుటుంబం అంతా భస్మం అయిపోవచ్చు లేదా వ్యాకోచిస్తూ వున్న సూర్యుడి పరిధి లోపడి బుధ, శుక్ర గ్రహాలు బలికావచ్చు. తను ఇప్పుడు ఏమేమి లెక్కలు వేసి చూసినా గతజలసేతు బంధనమేనా? ప్రయోజనం వుంటుందా? ఈశ్వరేచ్ఛ ఎలాగున్నా, మానవ ప్రయత్నం మనం చెయ్యాలి! గణిత సమీకరణాల రూపంలో సూర్యమండలం యొక్క నమూనా ఒకటి తన దగ్గర వుంది. ఈ నమూనాని కంప్యూటరు మీద నడపడానికి తన దగ్గర ఒక క్రమణం కూడ వుంది. కంప్యూటరు ఏమిటి చెబుతుందో చూద్దామని, ఆ క్రమణాన్ని పట్టుకొని కంప్యూటరు సెంటరు వైపు పరిగెత్తారు మిడతంభొట్లు. ప్రోగ్రాంని కంప్యూటరు సెంటరులో వదిలి పెట్టి, రిజల్టు వచ్చేలోగా వుత్తినే కాలయాపన ఎందుకని శర్మ గారి క్లినిక్‌కి వెళ్ళేరు.

డాక్టర్ శర్మ వైద్యుడే కాకుండా, చిరకాల మిత్రుడు,కుటుంబ స్నేహితుడూను. ఇద్దరూ రాజకీయాల దగ్గర నుండి వేదాంతం వరకూ అన్ని విషయాలూ చర్చిస్తారు. తన ఆరోగ్యానికేసి ధోకా లేదన్న ధీమాతోనూ, ఏదో బాతాఖానీ వేద్దామన్న ఉద్దేశంతోనూ మిడతంభొట్లు గారు శర్మ గారి క్లినిక్‌లో అడుగు పెట్టేరు. జరిగిన సంగతులన్నీ పూస గుచ్చినట్టు చెబుతూ వుంటే, శ్రద్ధగా విన్నారు శర్మ డాక్టరు గారి ముఖ కళవళికలను బట్టి, ఆయన మనో భావాలని ఆకళింపు చేసుకొందామనుకొన్న మిడతంభొట్లు గారికి నిరాశే

## చిట్టి కథ

### "పన్"

ముగ్గుల ముని సుందరి తన అవసాన కాలంలో యములాడు వస్తే, ఆయన్ను పొగిడి, వరం తీసుకున్నది. తన వారసుల్లో ఋషి పుట్టేదాకా తన ఆయుష్షు ఉండేలాగా అమాయక యమరాజు వరం ఇచ్చేసి, తర్వాత ఆవిడ "ముని" మనవడు పుట్టేదాకా వెయిట్ చేశాడు.



అప్పుడుగానీ తెలియలేదు ఆయనకి సుందరమ్మగారు తెలుగువారి వారసత్వ సంబంధాల మీద "పన్" (శ్లేష)ల్లే చేసిందని తెలుసుకున్నాక, ఆయన ఆవిడను బాగా మెచ్చుకుని, మరి కొంత ఆయుష్షు దానం చేశాడు అ(రి)వార్డుగా.

—సుశీలాచంద్

మిగిలింది. శర్మ గారి ముఖం గంభీరంగా వుంది. ఇలా అన్నారు మేష్టారితో!

"పైత్యం చేసిన వాడికి భూమి గిర్రున తిరుగుతూ వున్నట్లు కనిపిస్తుంది. దానిని ప్రయోజనాత్మకమయిన ఆధారంగా భావించి భూమి తిరుగుతున్నదీ అంటే మీరు ఒప్పుకుంటారా! అలాగని భూమి తిరగడం లేదని అనగలమా! కారణ-కార్య సంబంధం తార్కికంగా నిరూపించాలి కదా! మీవాడేదో 'బ్రహ్మాండం బద్దలవుతున్నది' అన్నాడని. ఆ విషయం పదేపదే ఆలోచించి. చిలవలు పలవలతో పగటి కలలు కన్నారేమో!"

"నా క్షోభ అంతా మానసిక మయినదని. మీరింత తేలికగా తోసి పారేస్తారని నేను అనుకోలేదు." మిడతంభొట్లు చిన్నబుచ్చుకున్నారు.

"శారీరకం కావచ్చు! మానసికం కావచ్చు! మంత్రం కావచ్చు. మీ వెనక వీధిలో వున్న సాయిబు చెడుపు. చిల్లంగి అంటారే అలాంటి క్షుద్ర విద్యని ఏదయినా మీ మీద ప్రయోగిస్తున్నాడేమో! అసలు. మీరు మీ పెరటి వీధిలో పుల్లయ్యతోనో. మీకారు డ్రైవరుతోనో మాట్లాడలేదని. మీరు విన్నదీ. కన్నదీ. విశ్వాంతరాళపు లోతుల నుండి వచ్చిన దనడానికి రుజువేదీ?"

"వాళ్ళు పదకొండు కాంతి సంవత్సరాల దూరం నుంచి గోల పెడుతున్నామని అఘోరిస్తున్నారు కదా?"

"నేనే శ్రీకృష్ణపరమాత్మని! వైకుంఠం నుండి మాట్లాడుతున్నాను అని నేనే టెలిఫోనులో మీకు చెబితే నమ్మేస్తారా?" నిలదీసి అడిగేరు శర్మ. మేష్టారిగొంతుకలో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. అహం దెబ్బతింది. అయినా తమాయించుకొని వింటున్నారు.

"చూడండి! పైత్యం చేసివుండవచ్చు. ఏదయినా ఎలర్జీ అయివుండవచ్చు. రేడియేషన్ దేమేనా మరొక పోసిబిలిటీ. ఏ వైరస్ లాంటిదో మీ మెదడులో దూరి హంగామా చేసి వుండవచ్చు. మరేదయినా అయివుండవచ్చు. పరీక్ష చేసిచూస్తే సరిపోతుందిగా"

పరీక్ష అనేసరికి మిడతంభొట్లుగారికి కొద్దిగా భయం వేసింది. "కాలు బెణికితే. ఇదేదో రూమేటిక్ హార్ట్ డిసీజ్‌లా వుందీ. ఓపెన్ హార్ట్ సర్జరీ చెయ్యాలి అన్నాడట. మీ లాంటి వైద్యుడే!" ఇందాకటి కుక్కకాటుకి చెప్పుదెబ్బ కొట్టేరు మిడతంభొట్లు.

డాక్టర్ శర్మ నిశ్చలంగా వున్నారు. "చూడండి! మన సూర్యుడు పదకొండు ఏళ్ళకొకసారి విపరీతంగా ప్రవర్తిస్తూ వుంటాడని మీరే చెప్పేరు. ఈ సమయంలో. ఆకాశంనుండి అనేక రకాల పరమాణు కిరణాలు. కాస్మిక్ కిరణాలు. మన భూగ్రహాన్ని విపరీతమయిన వేగంతో ఢీకొంటాయని కూడ మీరే నాకుచెప్పేరు. ఈ ఏకాదశవర్ష చక్రంలోకి సూర్యుడు ఈ మధ్యనే ప్రవేశించాడు కదా. ఈ సందర్భంలో ఒక కాస్మిక్ కిరణం మీ మెదడులో దూరి....."

"కాస్మిక్ కిరణాలు ఇంత హడావుడి చేస్తాయంటారా?" మొదటిసారిగా మిడతంభొట్లుగారి కంఠంలో మొండి తనం అదృశ్యమయి. ఆతృత గోచరించింది.

ఈ ప్రశ్నకి సమాధానంగా డాక్టరు అగ్గిపుల్ల గీసారు. దాని అంతరార్థం ఏమిటా అని మిడతంభొట్లు విస్తుపోయి చూస్తున్నారు.

"ఈ వెలుగు మీ కంటిలో రెటీనామీద పడుతుంది. రెటీనా ఈ వెలుగుని విద్యుత్ సాంకేతంగా మార్చి. నేత్రనాడి ద్వారా. మెదడులోని 'కపాలాస్తికతమ్మి' అనే భాగానికి పంపుతుంది. ఈ విద్యుత్ సాంకేతం. అక్కడ కొన్ని విద్యుత్ రసాయనిక క్రియలని ప్రేరేపించి. మీరు ఈ వెలుగుని చూస్తూవున్న భ్రమ కల్గిస్తుంది. ఇప్పుడు మీరు కళ్ళు మూసుకొనివున్నారనుకోండి. ఏదో ఒక విధంగా ఇందాకటి రసాయనిక క్రియని నేను మీ మెదడులో ప్రేరేపించేననుకోండి. ఇప్పుడు కూడ మీరు దీపాన్ని 'చూస్తూవున్నట్లు' భ్రాంతి పడతారు. అవునా?"


తార్కికంగా వున్న డాక్టరు గారి వాదనని ఖండించ లేక పోయారు మిడతంభొట్లు. "ఏ కాస్మిక్ కిరణమో. వైరస్ వంటిదో ఒకటి నా మెదడులో చేరి. అక్కడరసాయనిక క్రియలని ప్రేరేపించి. నాకి 'హల్లూసినేషన్' కల్గిస్తున్నాదంటారు?"


"మీరలా అధైర్యపడి పోకండి. మీరి ఉదయం విన్నవన్నీ ఏ కారణంచేతనయినా సంభవించ వచ్చని చెబుతున్నానంతే. ముందు సేంద్రియ లోపం ఏదీ లేదని తేల్చుకోవాలి కద!"

"సేంద్రియ లోపం ఏదీ లేదని ఒక వేళ తేలితే. అప్పుడు నేను మరొక ప్రపంచంలోని ప్రాణులతో మాట్లాడినట్లు ఒప్పుకుంటారా?"

"అలాగని నేననలేదే! సేంద్రియ లోపం లేకపోతే మానసిక దోషం ఏదయినా ఉందేమో చూడాలి అదీ లేకపోతే మీయింటి వెనక సాయిబు ఏమిటి చేస్తున్నాడో చూడాలి. ఇలా ఒకటీ. ఒకటీ ఎలిమినేట్ చేసిన తర్వాత సంగతి తర్వాత చూద్దాం."

మిడతంభొట్లు నీరుగారి పోయేరు. డాక్టరు మాత్రం తాను మరునాడు మిడతంభొట్లు గారి మీద చెయ్యవలసిన పరీక్షల






జాబితా ఒకటి నర్స్‌కి డిక్టేట్ చేస్తున్నారు. ఆయన వరస చూసేసరికి, మిడతంభొట్లు గారు గుండె అంటే రా యి చేసికొని వింటున్నారు గాని, శరీరంలో మరొహటి ఏదో చాల అవుగ్గా వున్నట్టు అనిపించింది. బరువుగా కాళ్ళీడ్చుకొంటూ ఇల్లు చేరుకున్నారు. కంప్యూటరుసెంటరుకి వెళ్ళడం మాటే మరచి పోయేరు.

మరునాడు ఉదయం ఎనిమిదయే సరికల్లా మిడతంభొట్లు క్లినిక్‌లో కాలుపెట్టేరు. సూదులు, గొట్టాలు పట్టుకొని నర్సులు చుట్టూ మూగేరు. రక్తపు పోటు, నాడి, హృదయ స్పందనం, ఇ. సి. జి. వగయిరాలు గుండెకి ధోకా లేదని తేల్చివేశాయి. బ్లడ్ టెస్ట్, గ్లూకోజ్ టోలరెన్స్ టెస్టులలో కూడ నెగ్గేసేరు. బుర్రకి తీగలు తగిలించి ఇ. ఇ. జి. తీసేరు. మెదడులోని విద్యుత్ రసాయనిక క్రియలన్నీ సవ్యంగానే జరుగుతునాయన్నారు. కంటి డాక్టరు వచ్చి, రెండు కళ్ళూ పరీక్ష చేసేరు. ఎడమ కన్నులో రెటినా, ఆప్టిక్ నెర్వ్ సరిగ్గానే వున్నా. ఎందువల్లనో సరీగా రెస్పాండవటం లేదన్నారు. అంటే కుడి మెదడులో ఏమయినా లోపం వుండవచ్చునేమోనని అనుమానం వుందన్నారు. కాని కుడి మెదడులో ఎక్కడ?

మెదడులో ఈ చెవి నుండి ఆ చెవి వరకు వున్న మేర కొంత దానిని చలనపు దార అంటారు. శరీరాంగాల కదలికని కంట్రోలు చేసే భాగాలన్నీ ఈ దార వెంబడే వున్నాయి ఈ దార మెదడుని 'ముందు', 'వెనుక' భాగాలుగా విడగొడుతుంది. ఎడమ మెదడు ముందు భాగంలో వాక్ కేంద్రం వుంది. మిడతంభొట్లు గారి మాటలో లోపం లేదు కనుక, వైద్యులు కుడి వైపు కేంద్రీకరించేరు. చలనపుదార వెనుక భాగంలో, దారని అనుకుని, చెవులపైన, మెదడు కిరుప్రక్కలా శ్రవణ కేంద్రాలున్నాయి. ఈ శ్రవణ కేంద్రం నుండి అలా మెదడు వెనకకి వెళితే కపాలాస్తిక తమ్మి అనే భాగం వస్తుంది. ఈ తమ్మి వెనుక భాగంలో దృష్టికేంద్రం వుంటుంది. కంటి నుండి ఈ దృష్టి కేంద్రం వరకు హరివిల్లు ఆకారంలో వంకరగా ఒక గీత గీస్తే, ఆ గీత శ్రవణ కేంద్రాన్ని తగులుతూ, 'వెర్నికీవైశాల్యం' అనే భాగం లోంచి, 'ఏంగ్యులర్ గైరస్' అనే భాగం లోంచి వెళుతుంది. దృష్టి కేంద్రంలో జరిగే రసాయనిక క్రియలవల్ల పొడచూపే దృశ్యానికి సంబంధించిన స్వరాలని ఈ "ఏంగ్యులర్ గైరస్" సృష్టిస్తుంది. ఈ భాగాలలో ఏది రోగగ్రస్థమయినా, మిడతంభొట్లు గారికి కనిపించినవీ, వినిపించినవీ జరగడానికి అవకాశం లేక పోలేదు.

న్యూరో సర్జన్ కళ్ళు మరొక సారి పరీక్ష చేశారు. కళ్ళలోని కండరాలు బలంగానే వున్నాయి. వాటి రిఫ్లెక్సెస్ కూడ చాల బాగున్నాయి. మెదడుకి రక్తాన్ని తీసికెళ్ళే గళధమనిలో ప్రవాహం బలంగా వుంది. ఇక ఈ కపాలాస్తిక తమ్మిని కంచు కాగడా వేసి వెతకాలి. అదొక బ్రహ్మ ప్రయత్నం.

నర్స్ వచ్చి 'టెక్నీషియం పెర్ టెక్నెటేట్' ఒక జబ్బలోకి ఇంజెక్షన్ ఇచ్చింది. ఆ మందు రక్తప్రవాహంతోపాటు మెదడులోకి వెళ్ళగానే, ఒక రకం కెమెరాతో బుర్రకి వివిధ కోణాలనుండి ఫొటోలు తీసేరు. తర్వాత ఏంజియోగ్రామ్ తీసేరు. ఈ రెండు రకాల ఫొటోలను పరిశీలించి, ఈ ఏంగ్యులర్ గైరస్ ప్రాంతంలో చిన్న వాపు వున్నట్లు నిశ్చయించేరు. అక్కడే ఏదో దోషం వుండి వుండాలి. అది ఎంత హాని చేస్తుందో, ఆవాపే మిడతంభొట్లుగారి లక్షణాలకి కారణమో, ఇథమిద్ధంగా మాత్రం నిశ్చయించలేకపోయేరు. "ఎక్స్‌ప్లోరెటోరీ సర్జరీ' అవసరం అన్నారు.


శస్త్రచికిత్సలో లాభాలెన్నివున్నాయో, నష్టాలు అన్నే వున్నాయి. మెదడులో దరిదాపు అంగుళంలోతు గొయ్యి తవ్వాలి ఆ గోతిగుండా వైద్యుడు వేలిని పోనిచ్చి, ఆ తమ్మిని పరీక్షించి చూడాలి. ఆ గొయ్యి వెళ్ళే మార్గంలోనే దృష్టి కేంద్రం వుంది. కనుక శస్త్రచికిత్సవల్ల దృష్టి శాశ్వతంగా పోయే అవకాశం వుంది. నిజానికి మానవుని మస్తిష్కం యొక్క కట్టడి పరిపూర్ణంగా అర్ధంకాలేదు. పొరపాటు జరిగితే ప్రాణహానే సంభవించవచ్చు ఏమీ చెయ్యకుండా నిర్లక్ష్యం చేస్తే మరేమి ముప్పు వస్తుందో: ముందు గొయ్యి, వెనుక నుయ్యి. అన్నివిషయాలూ కూలంకషంగా చర్చించి ఆఖరి నిశ్చయం మిడతంభొట్లుగారి భుజస్కంధాలమీద వదేశారు.

బరువయిన హృదయంతో మిడతం

చిటుకులు :

## సర్కారు ప''సందు''

ఇరుకుగా వుందని వీధికి అటూ యిటూ
ఇండ్లు పడగొట్టి వెడల్పు చేశారు



అందంకోసం మళ్ళీ రోడ్డు మధ్యలో
రిబ్బన్ పార్కు వేసి యిరుకు చేశారు!

—భండారు పర్వతాలరావు

బొట్లు ఇల్లు చేరుకునే వేళకి చుక్క పొడిచింది. క్లినిక్‌లో జరిగిన తతంగం అంతా పూసగుచ్చినట్లు సంసారంలోని సభ్యులందరికీ చెప్పేరు. ఆపరేషన్ ససేమిరా వల్ల కాదన్నారు నాన్నగారు. అసలు ఈ ఇంగ్లీషు డాక్టర్లకే వైద్యం చెయ్యడంరాదు పొమ్మన్నారు. ఇటువంటి జబ్బులని లొంగదీయడానికి హోమియోపతిలో రాంబాణం లాంటి మందుంది అన్నారు. ఏదో సీసా పట్టుకొచ్చి అరగంటకి మూడేసి మాత్రలు చొప్పున పుచ్చుకోమన్నారు. ఎందుకయినా మంచిదని కుర్రాడి జాతకం చూడడం మొదలు పెట్టేరు. మామ్మ అవధానికి కబురంపింది.

జాతకాన్ని బాగా పరికించిన తర్వాత నాన్నగారు తీర్మానించేరు. "అష్టమాధిపతి అయిన కుజుడు. అష్టమము జూచుట చేతనున్నూ. ఆయుః కారకుడయిన శని శుభక్షేత్రమందుండి గురు శుక్రుల మధ్య యుండుట చేతనున్నూ. లగ్నాధిపతి లగ్నమందుండి. శుభ సంబంధియై శుభాచ్ఛాదన యందుండుట చేతనున్నూ. ఆయుస్థానాధిపతికి శుభ సంబంధముండుట చేతనున్నూ. జాతకుడికి దీర్ఘాయుష్షు. కనుక మనవాడికి ఏమీ ఫరవా లేదు."

"ప్రాణాలతో బ్రతికున్నంత మాత్రాన్న సరిపోతుందా? కాలూ, చెయ్యి ఆడకుండా. తోటకూరకాడలా జీవితాంతం మంచం మీద మూలుగుతూ పడి వుండవలసి వస్తే?" అంటూ అమ్మ కొంచెం కోపమూ, కంగారు మేళవించింది.

ఈ కోణం నుండి జాతకాన్ని మరో సారి చూసి, వీలయితే మరమ్మత్తు చేద్దామని నిశ్చయించుకొన్నారు. ఈ లోగా అవధాని ఆంజనేయ దండకం చదువుతూ రానే వచ్చేడు. సాయిబు కాదు కదా! ఆ సాయిబు తాత కూడ తన మనవణ్ణి ఏమీ చెయ్యలేడని సవాలు చేసింది మామ్మ. ఈ తతంగం అంతా అయేసరికి అర్ధ రాత్రి కొచ్చింది. చీకట్లో చుక్కలు నల్లటి ముఖ్‌మల్ గుడ్డమీద జల్లిన వజ్రాల్లా ధగధగా మెరుస్తున్నాయి. మామ్మ గట్టిగా ఆవలించి "రామస్కంధం, హనూమంతం వైనతేయం వృకోదరం..." అంటూ అందరికీ గుడ్‌నైట్ చెప్పేస్తున్నది

"మందు ఏమయినా గుణం చేసిందిరా నాన్నా" అంటూ నాన్నగారు మరో మోతాదు వేసికోమని పెరటి వాకిట్లో పడుకున్న మిడతంభొట్లు గారి దగ్గరకు వస్తున్నారు.

మిడతంభొట్లు తృళ్ళి పడి ఒక్కసారి మంచం మీద నుండి కిందకి గెంతారు. లిప్త మాత్రంలో వాకిలి అంతా పట్టపగలులా అయిపోయింది. ఆకాశంలో అంత వరకూ కనిపించీ కనిపించనంతగా మిణుక్కు, మిణుక్కుమంటూ మెరుస్తూ వున్న నక్షత్రం ఒకటి అకస్మాత్తుగా ఎన్నో రెట్ల కాంతితో ప్రకాశించ సాగింది. ఏసు క్రీస్తు జన్మించిన తరుణంలో నాజరత్‌లో కనిపించిన తారలా మిలమిలా మెరిసి పోయిందా నక్షత్రం.

"అప్పుడే తెల్లారగట్ట అయిపోయిందర్రా" అంటూ మామ్మ కూడ వాకిట్లోకి వచ్చింది.

"అవతార పురుషుడెవరో పుడుతున్నాడురా!" అన్నారు నాన్న గారు.

మిడతంభొట్లుగారి మనోవీధిలో తళుక్కున మెరుపు మెరిసింది.

"రాంగ్ నెంబర్ నాన్నగారూ. రాంగ్ నెంబర్" అన్నారు ఆయన అప్రయత్నంగా.

మిడతంభొట్లుగారి మాటలలోని అంతరార్థం ఎవరికీ అర్థం కాలేదు.

"అదే, నాన్నగారు. ఇప్పుడు మనం చూస్తూన్న నక్షత్రం నోవాగా మారి పేలిపోయింది. నేను పొద్దుట నుండి వింటూ వున్న మాటలు, దృశ్యాలు మన భూలోకానికి వుద్దేశించినవి కావు. ఒక నక్షత్ర మండలం నుండి మరొక నక్షత్ర మండలానికి ఎవరో వార్త పంపుతూ వుంటే. అప్రయత్నంగా నేను ఆవార్తని "ఇంటర్‌సెప్ట్" చేశాను. ఇది మనకి రావలసిన "కాల్" కాదు."

ఈ తండ్రీ కొడుకుల సంభాషణ మామ్మగారికి మాత్రం అర్థం అవలేదు. ఎందుకొచ్చిన గొడవని.... "శయనే యః స్మరేన్నిత్యం. దుస్స్వప్నస్తస్య నశ్యతి" అని శ్లోకాన్ని పూర్తి చేసి పడకకి ఉపక్రమించింది.

●

## సమాచారమ్

## ఇందిరా మందిర సభ

ఇటీవల భీమవరం కళా స్రవంతి వారి ఆధ్వర్యంలో ఇందిరా మందిర సభ జరిగింది.

ఈ సభలో శ్రీ కె. వెంకటశివయ్య, డాక్టర్ జంధ్యాల మహతీశంకర్, డాక్టర్ ప్రసాదరాయ కులపతి, శ్రీ ప్రతాప వెంకట సుబ్రహ్మణ్య శర్మ, శ్రీ మొవ్వ వృషాద్రిపతి, డాక్టర్ ధారా రామనాథ శాస్త్రి, శ్రీ ఎస్. రాజన్నకవి, శ్రీ కృష్ణమూర్తి, శ్రీమతి ఎం. సత్యవతి పాల్గొన్నారు.

## విజ్ఞప్తి

నేను కీర్తిశేషులు మొక్కపాటి నరసింహ శాస్త్రిగారి రచనలమీద పరిశోధన చేస్తున్నాను. నాకు ఈ క్రింది రచనలు లభించ లేదు. 1. పిలక (కథ). 2. మిస్ మనోహరి (నవల). 3. సుబ్బారాయుడు. 4. సత్యంవద 5. స్వయంవరం (నాటికలు).

ఎవరి దగ్గరైనా ఉన్నట్లయితే దయతో నాకు పంపవలసినదిగా కోరుతున్నాను. నా అవసరం తీరగానే జాగ్రత్తగా తిరిగి పంపగలను. లేదా నాకు తెలిపినచో నేను వచ్చి ఫొటో స్టాట్ కాపీ తీసుకోవడంగాని, వ్రాసుకోవడంగాని చెయ్యగలను. ఇందుకు సాహితీమిత్రులు సహకరించ ప్రార్థన.

నా చిరునామా: నలుకుర్తి రాంబాబు, డోర్ నంబర్—11-9-1/ఎ. సమితి ఆఫీసు వద్ద, రామిరెడ్డి పేట, నరసరావు పేట.

❋

## శ్రీ సలాది కనకారావుకి "ఉపన్యాస కేసరి" బిరుదు

ఇటీవల విశాఖ ప్రేమ సమాజం ఆవరణలో "సలాది కవితా సంచిక" ఆవిష్కరణ సభ జరిగింది. శ్రీ కర్రా గోపాలం ఈ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి శ్రీరామచంద్రయ్య కవి సంచికను ఆవిష్కరించారు. ఈ సభలో రచయిత సలాది కనకారావుకు "ఉపన్యాస కేసరి" బిరుదు ప్రదానం చేశారు.

❋